సాక్షి
చిత్తూరు

మంగళవారం। 22। ఏప్రిల్। 2025



అయ్యా..సమస్యలు పరిష్కరించండి!

అయ్యా.. దూరప్రాంతాల నుంచి వచ్చి అర్జీలి స్తున్నాం.. మా సమస్యలు పరిష్కరించండని ప్రజలు అధికారులను వేడుకున్నారు. - 8లో



విద్యార్థి హల్‌'సెల్'

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరుగుతోంది. ముఖ్యంగా చిన్నారులు సెల్‌తో హల్‌ చల్‌ చేస్తున్నారు. - 8లో



రూ 1.85 లక్షలు మెక్కేశారు

బోరు మోటారు మరమ్మతు పేరుతో రూ.1.85 లక్షలు మెక్కేశారని మాజీ ఎంపీపీ మురళీకృష్ణ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. - 8లో

న్యూస్‌రీల్‌

ఇంటర్‌ డీఐఈఓగా శ్రీనివాసులు



చిత్తూరు కలెక్టరేట్‌ : జిల్లా ఇంటర్మీడియట్‌ డీఐఈఓగా ఏ. శ్రీనివాసులు నియమితుల య్యారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ కోనశశిధర్‌ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రంలో డీకే ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్న ఏ శ్రీనివాసులును చిత్తూరు డీఐఈఎగా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఆయనకు వైఎస్సార్‌కడప జిల్లా ఇంటర్మీడియట్‌ విద్య ఆర్జేడీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో చిత్తూరు డీఐఈఓగా పనిచేస్తున్న సయ్యద్‌ మౌలా తన పూర్వపు స్థానం కణ్ణన్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ప్రిన్సిపల్‌గా కొనసాగనున్నారు. నూతన డీఐఈఓ త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

వరసిద్ధుడికి రూ.1.77 కోట్ల ఆదాయం



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామివారి ఆలయానికి హుండీల ద్వారా రూ.1.77 కోట్ల ఆదాయం వచ్చిందని ఈఓ పెంచలకిషోర్‌ తెలిపారు. కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో హుండీల్లోత భక్తుల సమర్పించిన కానుకలను సోమవారం ఆలయాధికారులు లెక్కించారు. హుండీల ద్వారా దేవస్థానానికి రూ.1,71,77,943 ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా రూ.13,814, నిత్యాన్నదానం హుండీ ద్వారా రూ.42,436 వచ్చిందన్నారు. 309 యూఎస్‌ఏ డాలర్లు, 10 యూరోలు, 50 కెనడా డాలర్లు, 5 ఆస్ట్రేలియా డాలర్స్‌, 4 మలేషియా రింగిట్స్‌, 135 యూఏఈ దిర్హామ్స్‌ వచ్చాయన్నారు. బంగారం 165 గ్రాములు, వెండి 1.350 కిలోలు భక్తులు కానుక రూపంలో సమర్పించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ధనంజయ, ప్రసాద్‌, నాగేశ్వరరావు, కోదండపాణి, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



"మండుటెండల్లో కొబ్బరికాయలు అమ్ముతున్న ఈ రైతు పేరు సుబ్రమణ్యం. రోజూ కొబ్బరికాయల కోసం చెట్టు ఎక్కే కొడుకు.. అదే చెట్టు పైనుంచి పడి చనిపోతే, వయసైపోయిన భార్యను పోషించడానికి, ఈ పెద్దాయనే ప్రస్తుతం చెట్టు ఎక్కి కొబ్బరికాయలు కోసుకొచ్చి చిత్తూరులో అమ్ముతున్నాడు. ఇందుకోసం ఈ రైతు రోజూ చెల్లిస్తున్న కప్పం రూ.50. వాస్తవానికి కట్టాల్సిన గేటు రూ.20 మాత్రమే."

"రెండు రోజుల కిందట చిత్తూరు ప్రశాంత్‌ నగర్‌ వద్ద బలవంతపు గేటు వసూళ్లపై చిత్తూరుకు చెందిన జగ్గా, జంగాలపల్లెకు చెందిన కిరణ్‌ అనే ఇరువర్గాలు రోడ్లపై కొట్టుకున్నాయి. వారపు సంతలో గేటు ఎవరు వసూలు చేయాలో తెలియక ఇరువర్గాలు కొట్టుకోవడంతో యాదమరి పోలీసులు కేసులు నమోదు చేశారు."



తాటి ముంజెలు అమ్ముతున్న వ్యక్తి నుంచి రూ.50 గేటు వసూలు చేస్తున్న కలెక్షన్‌ బాయ్‌

బలవంతపు వసూళ్లు

చిత్తూరులో రోడ్లపై చిన్నపాటి వ్యాపారాలు చేసుకునే వారు, రైతుల రక్తాన్ని పీలుస్తూ.. వారి కష్టాన్ని దర్జాగా దోచుకోవడానికి 'గేటు' అనే పేరు పెట్టుకున్న కూటమి పార్టీకి చెందిన నాయకులు నడిరోడ్డుపై చేస్తున్న దౌర్జన్యాలను ప్రశ్నించే దిక్కు కనిపించడంలేదు. ఎక్కడో మారుమూల పల్లెలో పనులు దొరకని రైతులు పండించుకున్న కూరగాయాలను చిత్తూరులో విక్రయించుకుని, నాలుగు రూపాయలు సంపాదించుకోవడానికి వస్తుంటే.. వాళ్ల రక్తాన్ని పీల్చేస్తున్నారు. చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల్లోని మండలాల రైతులు, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు చెందిన రైతులు చిత్తూరు నగరానికి కూరగాయలను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. కార్పొరేషన్‌ అధికారులు నిర్ణయించిన ధరలు కాకుండా.. గేటు కాంట్రాక్టు దక్కించుకున్న వ్యక్తులు ఇష్టారాజ్యంగా బలవంతపు వసూళ్లకు పాల్పడుతూ రైతుల ఉసురు పోసుకుంటున్నారు.

గేటు జలగలు

రైతుల రక్తం పీల్చేస్తున్నారు!

- చిత్తూరులో కూటమి పార్టీ దౌర్జన్యాల 'గేటు'
- పేదల నుంచి రైతుల వరకు ఇష్టారాజ్యంగా వసూలు
- అడిగే దిక్కులేదు.. అడగాల్సిన అధికారుల మౌనం
- 'మార్కెట్‌ గేటు' పేరిట జనం నుంచి రూ.లక్షల లూటీ

చిన్న, సన్నకారులు రైతులు.. చిన్న కమతాల్లో వ్యవసాయం.. అరకొర దిగుబడులు.. ఆ పంట ఉత్పత్తులు చిత్తూరులో విక్రయం.. వచ్చిన సంపాదనతో జీవనం.. అయితే ఆ బడుగుజీవులనూ కూటమి నేతలు విడవడం లేదు. కాసులపై ఆశతో మార్కెట్‌ గేటు పేరిట బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారు. అడిగే దిక్కులేక.. ఆ కర్షకులు కక్కలేక మింగలేక తమకు వచ్చిన అరకొర ఆదాయంలో వారడిగినంత ముట్టజెప్పుతున్నారు.

చిత్తూరు అర్బన్‌: నగరంలో మార్కెట్‌ గేటు పేరిట కూటమి పార్టీకి చెందిన నేతల బహిరంగ దోపిడీకి పాల్పడుతున్నారు. రోజూ వేలాది మంది రైతులు, రోడ్లపై పూసలు అమ్మేవారు, కూరగాయలు, బొమ్మలు, పండ్లు, ఆకు కూరలు విక్రయించే వారు.. ఇలా ప్రతి ఒక్కరి నుంచి దౌర్జన్యంగా మార్కెటు గేటును వసూలు చేస్తున్నారు. అసలు ఎవరు గేటు చెల్లించాలి..? ఎవరికి మినహాయింపు ఉంది..? తట్టలో వ్యాపారం చేస్తే ఎంత..? బుట్ట పెట్టుకునే వాళ్లు ఎంత ఇవ్వాలి..? అనే ప్రశ్నలకు కార్పొరేషన్‌ అధికారులు నోరువిప్పి మాట్లాడకపోవడం, కనీసం నగరంలో గేటు ధరలు తెలిపే బోర్డులు పెట్టకపోవడం ఈ దౌర్జన్యాలకు ఊతమిచ్చినట్లవుతోంది.

నెలకు రూ.20 లక్షలకు పైనే..

చిత్తూరు నగరానికి ఐదు కిలో మీటర్ల పరిధిలో జరుగుతున్న గేటు దౌర్జన్యకాండను అటు పాలకులు, ఇటు అధికారులు పట్టించుకోవడంలేదు. రోజుకు రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు గేటు వసూలు చేస్తున్నారు. నెలకు సగటున రూ.20 లక్షల చొప్పున, ఏటా రూ.2 కోట్లపైనే వసూలు చేస్తున్నారు. గేటు వసూలు చేయడం చట్టవిరుద్ధం కాదు. కానీ వసూలు చేయాల్సిన దానికన్నా ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తుండడమే సమస్యకు కారణం. చాలా మంది రైతులు వాళ్ల కన్నీళ్లను దిగమింగుకుని ఈ గేటు చెల్లిస్తున్నారు. గేటు వసూళ్లల్లో వచ్చిన విభేదాలు నాటి టీడీపీ ప్రభుత్వ హయంలో అప్పటి మేయర్‌ అనురాధ, ఆమె భర్త కటారి మోహన్‌ జంట హత్యలకు కారణమనే విషయం చిత్తూరు ప్రజలకు తెలిసిన బహిరంగ సత్యం. అలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా ఉండాలంటే ఈ బలవంతపు గేటుకు కళ్లెం వేయాల్సిన అవసరం ఉంది.



చిత్తూరు నగరంలోని వీధి విక్రయదారులు

పోలీసు గ్రీవెన్స్‌కు 55 ఫిర్యాదులు



దివ్యాంగురాలి వద్దకే వచ్చి ఫిర్యాదు తీసుకుంటున్న ఏఎస్పీ

చిత్తూరు అర్బన్‌: నగరంలో నిర్వహించిన పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్‌) కార్యక్రమంలో 36 వినతులు అందాయి. చిత్తూరు ఏఎస్పీ రాజశేఖర్‌రాజు స్థానిక ఏఆర్‌ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు. వీటిలో కుటుంబ తగాదాలు, వేధింపులు, మోసాలు, ఇంటి తగాదాలు, భూ తగాదాలు, లావాదేవీలకు సంబంధించిన సమస్యలున్నాయి. పలు ఫిర్యాదులపై అప్పటికప్పుడే వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆయా స్టేషన్‌ హౌజ్‌ అధికారులతో మాట్లాడారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యపై విచారణ జరిపి, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే చిత్తూరు పోలీసు శిక్షణ కేంద్రం డీఎస్పీ రాంబాబు సైతం ప్రజల నుంచి ఫిర్యాదులను తీసుకున్నారు.

పదో తరగతి ఫలితాలు రేపు

చిత్తూరు కలెక్టరేట్‌ : పదో తరగతి పబ్లిక్‌ పరీక్షల ఫలితాలు ఈ నెల 23వ తేదీన విడుదల చేస్తారని డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడారు. 23వ తేదీ ఉదయం 10 గంటలకు ఫలితాలు విడుదల చేస్తారన్నారు. పరీక్షలు రాసిన విద్యార్థులు bre.ap.gov.in మనమిత్ర వాట్సాప్‌, లీప్‌ యాప్‌లలో చూసుకునేలా వెసులుబాటు కల్పించారన్నారు. వాట్సాప్‌లో 95523 00009 నంబర్‌కు ఏజీ (హాయ్‌) అని మెసేజ్‌ పంపి రోల్‌ నంబర్‌ నమోదు చేస్తే ఫలితాల పీడీఎఫ్‌ను పొందవచ్చని డీఈఓ వెల్లడించారు.

హజ్‌ యాత్రికులకు నేడు ఉచిత వ్యాక్సినేషన్‌

చిత్తూరు రూరల్‌ (కాణిపాకం): హజ్‌ యాత్రికులకు మంగళవారం ఉచితంగా వ్యాక్సినేషన్‌ వేయనున్నట్లు డీఐఓ హనుమంతరావు తెలిపారు. చిత్తూరు నగరం టెలిఫోన్‌ కాలనీ అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌లో ఉదయం 8 గంటలకు ఉచిత వ్యాక్సినేషన్‌ కార్యక్రమం ఉంటుందన్నారు. హజ్‌యాత్రకు వెళ్లే ముస్లింలు ఈ వ్యాక్సినేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

నోటితో మాట్లాడి.. నొసటితో వెక్కిరించినట్టుంది కూటమి సర్కారు పరిస్థితి. ప్రతి నెలా చౌక దుకాణాలకు సరుకులు సక్రమంగా పంపిణీ చేయాల్సి ఉన్నా మిగులు సాకుతో కోత పెడుతోంది. ఆ మిగులు ఏమవుతోందో కానీ పేదలకు మాత్రం బియ్యం అందడం లేదు. ఫలితంగా పేదలు పరేషాన్‌ అవుతున్నారు.



పుల్లూరులో నిరసనకు దిగిన కార్డుదారులు(ఫైల్‌)

పేదలు పరేషాన్‌



పేదలకు బియ్యం కోత..!

- జిల్లాలో అరకొరగా బియ్యం సరఫరా
- వేలిముద్రలు వేసుకుని బియ్యం ఇవ్వని వైనం
- ముగిసిన పంపిణీ గడువు

జిల్లాలో రేషన్‌ వివరాలు

ఎంఎల్‌ఎస్‌ పాయింట్లు	41
చౌకదుకాణాలు	1390
మొత్తం రేషన్‌కార్డులు	5,36,686
రేషన్‌ తీసుకున్న కార్డుదారులు	4,69,468
రేషన్‌ తీసుకోనివారు	67,218

కాణిపాకం: కూటమి ప్రభుత్వం పేదల కడుపు కొడుతోంది. డీలర్ల చేతివాటానికి కార్డుదారులను బలి చేస్తోంది. పలుచోట్ల వేలిముద్రలు వేసుకుని బియ్యం ఇవ్వకుండా డీలర్లు చేతులు దులుపుకున్నారు. రేషన్‌ పంపిణీ గడువు సోమవారంతో ముగియడంతో కార్డుదారులు లబోదిబోమంటున్నారు. అయినా పౌరసరఫరాల శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. చిత్తూరు జిల్లాలోని 1,390 చౌక దుకాణాల పరిధిలో 5,36,686 రేషన్‌ కార్డులున్నాయి. వంద శాతం రేషన్‌ పంపిణీకి మిగులు బియ్యం ఆధారంగా ప్రతి నెలా జిల్లాకు 9 నుంచి 10 టన్నుల రేషన్‌ బియ్యం అవసరమవుతోంది. అయితే ఈ నెల 8,300 టన్నుల బియ్యం మాత్రమే సరఫరా జరిగింది.

కోతలిలా..

జిల్లాలో ఈ నెలకు 9 వేల టన్నుల రేషన్‌ బియ్యం అవసరం కాగా కేవలం 8 వేల టన్నులు మాత్రమే ప్రభుత్వం సరఫరా చేసింది. వెయ్యి టన్నుల వరకు జిల్లాకు కోత పెట్టింది. ఆ తర్వాత 300 టన్నుల బియ్యాన్ని సరఫరా చేసి చేతులు దులుపుకుంది. ఈ లెక్కన్న 6 షాపులకు సరిపడ బియ్యం ఉందని ప్రభుత్వం సరఫరాను ఆపేసినట్లు అధికారులు చెబుతున్నారు. మరో 40 షాపులకు 10 శాతం బియ్యం సరఫరా చేసినట్లు చెబుతున్నారు. మరి కొన్ని షాపులకు 20 నుంచి 30 శాతం వరకు మాత్రమే సరుకు చేరిందని వెల్లడించారు. దీని దెబ్బకు జిల్లా వ్యాప్తంగా రేషన్‌ పంపిణీ గందరగోళంగా మారింది. కొన్ని చోట్ల రేషన్‌ సకాలంలో ఇవ్వక ఇబ్బంది పెట్టేశారు. మరికొన్నిచోట్ల కార్డుదారుల నుంచి ముందుగానే వేలిముద్రలు వేసుకుని, బియ్యం వరకు సర్దుబాబు చేశారు. కొన్ని షాపుల్లో వేలిముద్రలు వేసుకుని సరుకులు లేదని చెప్పేశారు. కొంత మంది అసలు రేషన్‌ రాలేదని తిప్పి పంపించేశారు. సోమవారం సాయంత్రానికి జిల్లా వ్యాప్తంగా 5,36,686 కార్డులదారులగాను 4,69,468 మంది రేషన్‌ తీసుకున్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. ఈ లెక్కన్న 67,218 మంది రేషన్‌కు దూరమయ్యారు.

పుంజుకున్న అక్రమ వ్యాపారం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలో రేషన్‌ అక్రమ వ్యాపారం పుంజుకుంది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని జిల్లాలో 250 మందిపైగా డీలర్లను తొలగించారు. దీంతో అక్కడి నుంచి ఆరంభమైన అక్రమవ్యాపారం.. జోరుగా సాగింది. గత పది నెలల కాలంలో 80 మెట్రిక్‌ టన్నుల బియ్యం పట్టుబడగా, అందుకు సంబంధించిన వ్యాపారులంతా కూటమి పార్టీకి చెందిన వారే కావడం గమనార్హం.

ఐరాలలో మండలంలో ఇలా..

బియ్యం పంపిణీ గడువు ముగిస్తున్నా బియ్యం ఇవ్వకపోవడంతో ఆదివారం ఐరాల మండలం పుల్లూరు గ్రామానికి చెందిన కార్డుదారులు రేషన్‌ కార్డులు చూపుతూ నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వీఆర్వో ద్వారా సరుకులు ఇస్తున్నారని.. ఆయన వేలిముద్రలు వేసుకుని సరుకులు ఇవ్వడం లేదని మండిపడ్డారు. 70 మందికి ప్రతినెలా సరుకులు ఇవ్వడం లేదని తక్షణమే అధికారులు చర్యలు తీసుకుని పంపిణీ చేయాలని డిమాండ్‌ చేశారు.

మిగులు ఏమైనట్టో..

జిల్లాలో 250 చౌక దుకాణాల పరిధిలో ఈ నెల బియ్యం కొరత వచ్చింది. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో జరిగిన పంపిణీలో సగటున లెక్క వేసి, బియ్యం డీలర్లకు సరఫరా చేశారు. గత నెల మిగులు బియ్యం, తాజాగా సరఫరా అయిన స్టాక్‌తో ఏ సమస్య రాకూడదు. అయితే గత రెండు, మూడు మాసాలుగా బియ్యం కొరత వస్తోందంటున్నారు. దీనికి కారణమేమిటో అధికారులే చెప్పలేకపోతున్నారు.

ఇట్టా చేస్తే ఎట్టా...



"మేము పేదోళ్లం. మా కడుపులు కొడితే ఎట్టా. రేషన్‌ ఇవ్వకుండా మానేస్తే ఏం చేయాలి.. ఏం తినాలి. దీనే నమ్ముకుని బతుకుతుండాం. ఈనెల రేషన్‌ ఇవ్వకుండా చేస్తే...దిక్కుమొక్కుల లేనోళ్లం. ప్రతి నెల ఇది మాదిరిగానే జరిగితే కష్టం. అధికారులు ఓ తూరి మా బతుకులు చూసి రేషన్‌ ఇచ్చేలా చూడండా.

–అదెమ్మ, పుల్లూరు గ్రామం, ఐరాల

రెండు నెలలుగా ఇవ్వలేదు..



ప్రభుత్వం ఇచ్చే రేషన్‌ సరుకులతోనే మూడు ముద్దలు తింటున్నాం. ఆ బియ్యం రెండు నెలలుగా రేషన్‌ ఇవ్వకపోతే మేం ఎట్టా బతకాలి. డీలర్‌ షాప్‌కు వస్తే స్టాక్‌ రాలేదంటున్నారు. బయట ఇదే రేషన్‌ బి య్యం కేజీ రూ.20 నుంచి రూ.25కు అమ్ముతున్నా రు. సన్నబియ్యం కేజీ రూ. 60 ఆ ధరలు చూస్తేనే మా కడుపులు మండిపోతున్నాయి.

–సుధాకర్‌, పుల్లూరు, ఐరాల

సామీ.. ఎన్నిసార్లు అర్జీలిచ్చేది!

- కలెక్టర్‌ గ్రీవెన్స్‌డేకు పోటెత్తిన అర్జీదారులు
- రెవెన్యూ సదస్సులో పరిష్కారం కాని సమస్యలే అధికం
- మొత్తం అర్జీల్లో 95 శాతం రెవెన్యూసమస్యలే



గ్రీవెన్స్‌డేలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌ గాంధీ, జేసీ విద్యాధరి

పలమనేరు: 'ఇంతకు ముందు చిత్తూరుకెళ్లి మూడు దఫాలు అర్జీలిచ్చా.. మళ్లీ ఇక్కడ ఇస్తున్నా.. ఎన్నిదఫాలిచ్చినా నా సమస్య పరిష్కారం కాలేదు..ఎప్పుడు అవుతుందో తెలియలేదు సామీ.. ఇంకెన్నిసార్లు అర్జీలిచేది.' అంటూ ఆవేదన వ్యక్తం చేసేవారే పలమనేరులో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌డేలో ఎక్కువగా కనిపించారు. పట్టణ సమీపంలోని ఆర్డీఓ కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఇందులో జిల్లా కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌ గాంధీ, ఎస్పీ మణికంఠ చందోలు, స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్‌, ఆర్డీఓ భవానీ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఉదయం 9 నుంచే అర్జీదారులతో కార్యాలయం, ప్రాంగణం నిండిపోయింది. ఆవరణలో అర్జీలు రా యించుకోవడం, వాటికి ఎంట్రీలు, ఆపై విన్న పాలు, దానికి రసీదులిచ్చే కార్యక్రమాలు జరిగాయి.

ఇందులో కొన్ని మచ్చుకు...

- పొలం తనదే కానీ ఆన్‌లైన్‌లో లేదయ్యా.. రెండేళ్లుగా అర్జీలిస్తున్నానని పుంగనూరు మండలం నెక్కొంది గ్రామానికి చెందిన తోటి సాలమ్మ తెలిపింది.
- అన్నదమ్ముల భాగపరిష్కారం కాకనే తమ్ముడు రోడ్డుకు పడిన డబ్బును తినేసి తనకు భూమివ్వడం లేదని బైరెడ్డిపల్లి మండలం కూటాలవంక గ్రామానికి చెందిన పీ. నారాయణప్ప తెలిపాడు.
- తన పొలాన్ని ఎక్స్‌ప్రెస్‌ హైవేకి తీసుకుని కొంతమాత్రమే ఇచ్చి ఇంకా డబ్బులివ్వలేదని న్యాయం చేయాలని పలమనేరు మండలంలోని కొలమాసనపల్లికి చెందిన నారాయణప్ప ఆవేదన వ్యక్తం చేశాడు.
- ఇటీవల తమ పొలం పక్కన పొలాన్ని కొన్న హరి అనే రైతు ఎన్నో ఏళ్లుగా తమ పొలానికి వెళుతున్న దారిని ఆక్రమించుకున్నాడని పలమనేరు మండలం మాదికబండకు చెందిన శ్యామలమ్మ చెప్పుకొచ్చింది.
- తనకు మోకాలు చిప్ప లేదని దీంతో వికలాంగ పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నా పింఛన్‌ రావడం లేదని పట్టణంలో ముత్యాలపాళేనికి చెందిన శ్రీరాములు బాధపడ్డారు.
- గతంలో తనకు వృద్ధాప్య పింఛన్‌ వచ్చేదని, ఆపై ఎందుకో తనకు పింఛను ఇవ్వడం లేదని పట్టణంలోని గంటావూరు కాలనీకి చెందిన మునెమ్మ మొరపెట్టుకుంది.
- తన భూమిని వేరేవాళ్లు ఆక్రమించుకున్నారని, దీనిపై పలుమార్లు అధికారులకు విన్నవించినా లాభం లేక ఇప్పుడు ఇక్కడికి న్యాయం కోసం వచ్చానని గంగవరం మండలం బండమీదజరారిపల్లికు చెందిన భూపతి తెలిపాడు. ఈ సమస్యలను ఆయా శాఖలకు పంపి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌ తెలిపారు.

ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రవికుమార్‌ నాయుడు, పీఆర్‌ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు రవికుమార్‌, శ్రీదేవి, డీపీవో సుధాకర్‌రావు పాల్గొన్నారు.

మొత్తం 428 అర్జీలు...

పలమనేరులో జరిగిన గ్రీవెన్స్‌డేకు మొత్తం 428 అర్జీలు రాగా వీటిల్లో రెవెన్యూశాఖకు సంబంధించి ఆన్‌లైన్‌ మ్యుటేషన్‌లు 87, పాసు పుస్తకాల సమస్యలు 86, భూతగాదాలు 66, రీసర్వే సమస్యలు 37, ఆక్రమణలు 36, ఆర్‌ఓఆర్‌ సమస్యలు 23, దారి సమస్యలు 18, ఇళ్ల పట్టాల సమస్యలు 16, పెన్షన్ల తొలగింపులు 14 వచ్చాయి. ఇందులో 95 శాతం రెవెన్యూ సమస్యలే వచ్చాయి. మిగిలిన 25 విభాగాలకు సంబంధించి వ్యక్తిగత సమస్యలున్నాయి.



రెవెన్యూ సమస్యలపై పోటెత్తిన అర్జీదారులు

రక్తహీనత రహిత సమాజమే లక్ష్యం



చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న పీడీ వెంకటేశ్వరి

గంగాధరనెల్లూరు: రక్తహీనత రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా శిశు సంక్షేమ శాఖ పీడీ వెంకటేశ్వరి అన్నారు. సోమవారం గంగాధర నెల్లూరు మండలంలోని ఐసీడీఎస్‌ ప్రాజెక్టు కార్యాలయంలో పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. పీడీ మాట్లాడుతూ పోషణ్‌ పక్వాడ్‌ కార్యక్రమంపై గ్రామాల్లో అవగాహన కల్పించి, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి రక్తహీనత లేని సమాజాన్ని నిర్మూలించాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించి, చిన్నారులకు పీడీ వెంకటేశ్వరి, సీడీపీఓ వినీతాశ్రీ, అన్నప్రాసన్న చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, ఎంఈఓ గుణశేఖర్‌రెడ్డి, సీహెచ్‌ఓలు శ్రీనివాసులు, జ్ఞానశేఖర్‌, సర్పంచ్‌ సుబ్రమణ్యం, పర్యవేక్షకులు అనురాధ, బిందు, మాలతి, నాగరత్నమ్మ, భాగ్యలక్ష్మి, సంగీత పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెక్‌డ్యామ్‌ ధ్వంసం



ధ్వంసమైన చెక్‌ డ్యామ్‌

శాంతిపురం: రాళ్లబూదుగూరు పంచాయతీలోని సాతు వద్ద ఉపాధి హామీ నిధులతో నిర్మించిన చెక్‌ డ్యామ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రెడ్డివారిపల్లి నుంచి సాతు కొత్త చెరువుకు నీరు వెళ్లే వంకపై పదేళ్ల క్రితం చెక్‌ డ్యామ్‌ నిర్మించారు. ఇక్కడ నీరు నిండితే సమీపంలోని బోర్లలో నీటి మట్టం పెరిగి రైతులకు ఉపయోగంగా ఉండేది. కానీ ఇటీవల ఎవరో చెక్‌ డ్యామ్‌ను పగులగొట్టినట్టు స్థానికులు గుర్తించారు. చెక్‌ డ్యామ్‌నకు గండి కొట్టడంతో వర్షాలు కురిసి వంకలో నీరు వచ్చినా రైతులకు ఉపయోగపడని పరిస్థితి ఏర్పడిందని వారు వాపోతున్నారు. అధికారులు స్పందించి చెక్‌ డ్యామ్‌ మరమ్మతులు చేసి, దాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి శిక్షించాలని వారు కోరుతున్నారు.

సీఆర్సీ నిధులు దుర్వినియోగంపై ఫిర్యాదు

గుడుపల్లె: ప్రభుత్వ పాఠశాలలకు ఏటా ఇచ్చే మెయిన్‌టెన్స్‌ గ్రాంట్‌ నిధులను సీఆర్సీ ఇన్‌చార్జ్‌లు దుర్వినియోగం చేశారని పాఠశాల ఉపాధ్యాయులు జిల్లా కలెక్టర్‌ సుమిత్‌ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. గుడుపల్లె మండలంలో గుడుపల్లె, శెట్టిపల్లె, పొగురుపల్లె, యామగానిపల్లె, సోడిగానిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలను 5 క్లస్టర్‌ పాఠశాలలు ఉన్నాయి. 2024–25 సంవత్సరానికి గాను ఒక్కొక్క క్లస్టర్‌కు రూ.లక్ష వంతున రూ.5 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులను క్లస్టరు పాఠశాలకు మెయిటెన్స్‌ కోసం ఖర్చు చేయాలన్నారు. కానీ గుడుపల్లె క్లస్టర్‌కు సంబంధించిన రూ. లక్ష నిధులు దుర్వినియోగం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. క్లస్టర్‌ సమావేశం నిర్వహించకుండా ఉపాధ్యాయుల సూచనలు తీసుకోకుండా బినామి బిల్లులు పెట్టారన్నారు. గతంలో నాడు– నేడు కార్యక్రమంలో తీసుకువచ్చిన ఫర్నిచర్‌, బుక్స్‌లు, మెటీరియల్‌తోపాటు పాత వస్తువులను చూపి, కొత్త బిల్లులు సృష్టించారు. ఈ బిల్లులు ప్రకారం 2024–25 సంవత్సరానికి సంబంధించిన ఈసీలను ఉన్నతాధికారులకు అందించారన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చిన్నారి హాల్‌ సెల్‌



కూర్చున్నా.. పరిగెడుతున్నా..తింటున్నా.. పడుకున్నా..సెల్‌ చెంతనే ఉండాల్సిందే. ఇది లేని జీవితాన్ని ఊహించడం కష్టసాధ్యంగా మారుతోంది. పిల్లలు పెద్దల ప్రమేయం లేకుండానే గేమ్‌లు ఆడుతున్నారు. తమకు కావాల్సిన ఆటలు డౌన్‌లోడ్‌ పెట్టుకుంటున్నారు. ఈ పరిణామం ఆందోళన కలిగిస్తోంది. ఇందులో మంచి తోపాటు చెడు మిళితమై ఉండడంతోపాటు అతి వినియోగంతో అనర్థాలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

- సోషల్‌ మీడియాకు బానిసలవుతున్న విద్యార్థులు
- పెరిగిన సోషల్‌ మీడియా వినియోగం
- అనవసర వీక్షణ
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పది లక్షలు దాటిన సెల్‌ఫోన్‌ యూజర్లు
- అతివాడకంతో ఆరోగ్య సమస్యలు తప్పవంటున్న వైద్యులు

పలమనేరు: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో స్మార్ట్‌ఫోన్ల వినియోగదారుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఎలాంటే.. ఒక నిమిషం చేతిలో సెల్‌ లేకుంటే బతకలేమన్నట్టుగా తయారయ్యారు నేటి విద్యార్థులతు, పిల్లలు, యువకులు. డ్రగ్స్‌కు బానిసైనట్టు స్మార్ట్‌ఫోన్‌ కారాగారంలో నేటి తరం బందీలుగా మారారు. ఇప్పుడు పట్టణాలు, పల్లెలనే తేడా లేకుండా స్మార్ట్‌ఫోన్ల వాడకం విద్యార్థుల్లో ఎక్కువైంది. పిల్లాడు అన్నం తినాలంటే మొబైల్‌, బడికి రెడీ కావాలంటే మొబైల్‌, బడి నుంచి రాగానే సెల్‌ఫోన్‌ చేతిలో పెట్టాల్సిందే. పసిబిడ్డలు సైతం ఏడుపు ఆపాలంటే తల్లిపాలు పట్టడం కంటే చేతిలో సెల్‌ పెట్టగానే సైలెంట్‌ అవుతున్నారు. మొబైల్‌ లేకుంటే మనషులకు బుర్ర కూడా పనిచేయడం లేదు. మితిమీరిన సెల్‌ వాడకం మనిషి జీవితాన్ని చిన్నాభిన్నం చేస్తున్నా మార్పు రావడం లేదు. ఇప్పటికే చాలామంది వారికి తెలియకనే మానసిక రోగుల్లా మారారు. ఇంకొందరు అనారోగ్యం పాలవుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు స్మార్ట్‌ఫోన్లకు బానిసలుగా మారిపోవడం తల్లిదండ్రులకు ఆందోళన కలిగిస్తోంది.

సోషల్‌ మీడియా వాడకం పరిస్థితి ఇదీ!

ఇటీవల యాన్యువల్‌ స్టేషస్‌ ఆఫ్‌ ఎడ్యుకేషన్‌ నివేదికలో వెల్లడించిన అంశాలు తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. సోషల్‌ మీడియా బానిసలైన వారిలో 14 ఏళ్లలోపు పిల్లలు 79 శాతం, 15 నుంచి 20 ఏళ్ల వయసున్న వారిలో 82 శాతం, మహిళలు 75 శాతం ఉండడం కొసమెరుపు.

ఇదిగో సాక్ష్యం..

పలమనేరు పట్టణంలో ఇంజినీరింగ్‌ చదవుతున్న ఓ విద్యార్థిని సెల్‌ఫోన్‌ అతిగా వాడొద్దని తల్లిదండ్రులు మందలించారు. దీంతో అప్పటికే సెల్‌కు బానిసైన ఆ విద్యార్థి తన గదిలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని పదో తరగతి చదివే బాలికకు సెల్‌ఫోన్‌ కొన్విలేదని తన చేతిని బ్లేడ్‌తో కోసుకుని ఆస్పత్రి పాలైంది. సెల్‌ ఇవ్వలేదని ఐదో క్లాస్‌ చిన్నారి ఇంటి నుంచి పరారయ్యాడు. ఇలాంటి సంఘటనలు జిల్లాల్లో నిత్యకృత్యంగా మారాయి.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పది లక్షల స్మార్ట్‌ఫోన్లు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1990లో కీప్యాడ్‌ఫోన్ల వాడకం మొదలైంది. తొలుత తిరుపతి, చిత్తూరు, కుప్పం, మదనపల్లెలో రిలయన్స్‌ మొబైల్‌ టవర్ల ద్వారా నెట్‌వర్క్‌ను అందిస్తూ సేవలను మొదలు పెట్టారు. ఆపై పలు సెల్‌ కంపెనీలు మార్కెట్‌లోని వచ్చాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 8 వేల దాకా సెల్‌ఫోన్‌ టవర్లున్నాయి. ఉమ్మడి జిల్లా జనాభా 44 లక్షలు కాగా వీరిలో సెల్‌ఫోన్లు (కీప్యాడ్‌, టచ్‌ మొబైల్‌)వాడే వారి సంఖ్య ప్రస్తుతం 10 లక్షలకు చేరింది. గత నాలుగేళ్లుగా సెల్‌ఫోన్ల వాడకం ఏటా 15 శాతం పెరుగుతున్నట్టు ట్రాయ్‌(టెలీఫోన్‌ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్‌ ఇండియా) లెక్కలు చెబుతున్నాయి. స్మార్ట్‌ఫోన్లను వాడేవారిలో రోజుకు సగటున యువత 4 గంటలు, విద్యార్థులు 2 గంటలు, గృహిణిలు 2 గంటలు, అధికారులు 1.30 నిమిషాలు, పిల్లలు గంటపాటు సమయాన్ని కేటాయిస్తున్నట్టు తెలిసింది.



ఎక్కువ మంది యూట్యూబ్‌ వీక్షకులే

స్మార్ట్‌ఫోన్‌ వాడుతున్న వారిలో 80 శాతం మంది యూట్యూబ్‌ చూస్తుండగా, 60 శాతం మంది వాట్సాప్‌, ఫేస్‌బుక్‌, ఇన్‌స్టాగామ్‌ను వాడుతున్నట్టు గూగుల్‌ చేసిన సర్వేలో తేలింది. విద్యార్థులు, యువతలో 50 శాతం మంది ఆన్‌లైన్‌లో గేమ్స్‌ కోసం సమయాన్ని వెచ్చిస్తున్నారు. మహిళలు పనిపాట చేసుకుంటూ కూడా సీరియళ్లను సెల్‌లోనే చూసేవారి సంఖ్య పెరుగుతోంది. ఇక చిన్నపిల్లలు సైతం స్మార్ట్‌ఫోన్‌లో కార్టూన్‌ స్టోరీస్‌ చూడకుండే ఏడుపు మొదలు పెట్టడం చూస్తూనే ఉన్నాం.

అనారోగ్య సమస్యలు తప్పనట్టే



సెల్‌ చూస్తున్న కారణంగా నిద్రలేమి ప్రధాన సమస్యగా మారుతోంది. దీంతో మనిషి జ్ఞాపకశక్తి, ఏకాగ్రత దెబ్బతింటోందని(డబ్ల్యూహెచ్‌ఓ) ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలో తెలిపింది. శరీరంలో మెలటోనియన్‌ నిల్వలు నశించి డిప్రెషన్‌లోకి వెళ్లే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా నిద్రలేమి కారణంగా అధిక బరువు, లావెక్కడం జరుగుతుంది. పిల్లలకు తలనొప్పి, చూపు మందగించి కంటి అద్దాలను వాడాల్సిందే. అలాగే పలు అనారోగ్య సమస్యలు తప్పవు.

– మమతారాణి, ఏరియా ఆస్పత్రి సూపరిండెంటెంట్‌, పలమనేరు

మంచి కంటే చెడే ఎక్కువ



పుట్టిన పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ ఇప్పుడు సెల్‌ఫోన్‌ ఓ లోకంలా మారిపోయింది. కొందరైతే కనీసం టూజీబీ ఖాళీ చేస్తే గానీ మనసు కుదుటపడదు. ముఖ్యంగా చిన్నపిల్లలు బడి నుంచి ఇంటికి రాగానే చేతిలో సెల్‌ ఉండాల్సిందే. విద్యార్థులకు సైతం స్మార్ట్‌ఫోన్‌ వ్యామోహం పెరిగింది. వీటిని తల్లిదండ్రులు నియంత్రించాలి. ఎక్కువగా సెల్‌ వాడకంతో మంచికంటే చెడే ఎక్కువ అని గ్రహించి సమాజంలో మార్పు రావాలి.

– డాక్టర్‌ రాజేంద్రరెడ్డి, విశ్రాంత ప్రిన్సిపల్‌, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పలమనేరు

రాష్ట్ర స్థాయి పరుగు పందెం పోటీల విజేత విక్రాంత్‌రెడ్డి



పతకంతో విక్రాంత్‌ రెడ్డి

రొంపిచెర్ల: రాష్ట్రస్థాయి దివ్యాంగుల రన్నింగ్‌ రేస్‌ పోటీల్లో రొంపిచెర్ల ఆదర్శ పాఠశాల దివ్యాంగ విద్యార్థి విక్రాంత్‌ రెడ్డి విజేతగా నిలిచాడు. చిత్తూరు జిల్లా సదుం మండలం ఎర్రాతివారిపల్లెకు చెందిన విక్రాంత్‌ రెడ్డి రొంపిచెర్ల ఆదర్శ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో సోమవారం జరిగిన దివ్యాంగుల రాష్ట్రస్థాయి పరుగుపందెం పోటీల్లో విక్రాంత్‌ రెడ్డి విజేతగా నిలిచారని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్‌ సరళ, భవిత పాఠశాల ఉపాధ్యాయురాలు అములు తెలిపారు. విన్నర్స్‌గా నిలిచిన విద్యార్థి విక్రాంత్‌ రెడ్డిని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంఈఓలు ఇందిర, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు అభినందించారు.

కక్ష కట్టి దాడులు

చిత్తూరు రూరల్‌ (కాణిపాకం):కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కక్షకట్టి దాడులకు పాల్పడుతున్నారని, దౌర్జన్యంగా పెద్దిరెడ్డి కుటుంబంపై తప్పుడు కేసులు బనాయిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్‌ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ ధ్వజమెత్తారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన తనయుడు మిథున్‌రెడ్డిపై పెట్టిన తప్పుడు కేసులపై ఎలాంటి ఆధారాలు లేవని, నియోజకవర్గంలో నిజాయితీగా అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. కూటమి ప్రభుత్వంవారిపై లేనిపోని నిందలు మోపడమే పనిగా పెట్టుకుందని అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టడం మానుకుని, రాష్ట్రాభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. ప్రశ్నించే వారిని ఇబ్బంది పెట్టవద్దని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర బీసీ సెల్‌ ప్రధాన కార్యదర్శిగా పదవి ఇవ్వడం పట్ల అధినేత జగన్‌మోహన్‌ రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్‌ రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

స్పృహ కోల్పోయిన బస్‌ కండక్టర్‌

యాదమరి: అధిక రక్తపోటుతో ఓ ప్రైవేటు బస్సు కండక్టర్‌ స్పృహ తప్పి పడిపోయిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. చిత్తూరు – గుడియాత్తం మార్గంలో సోమవారం ఓ ప్రైవేటు బస్సు ప్రయాణిస్తోంది. మండలంలోని కమ్మారాయునిమిట్ట సమీపంలోకి రాగానే బస్సులోని చిత్తూరు నగరానికి చెందిన కండక్టర్‌ ఒంట్లో చాలా మగతగా ఉందని.. కళ్లు తిరుగుతోందని బస్సులోని ప్రయాణికులకు చెప్పాడు. కొంతసేపటికే ఆయన స్పృహ తప్పి పడిపోయాడు. ఇది గమనించిన ప్రయాణికులు హుటాహుటిన మండల కేంద్రంలోని ఓ ప్రథమ చికిత్స కేంద్రానికి తరలించి, చికిత్స అందించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో మెరుగైన వైద్యసేవలు కోసం చిత్తూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి



మతిస్థిమితం లేని వ్యక్తి మృతదేహం

గుడిపాల: మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందినట్లు గుడిపాల ఎస్‌ఐ రామ్మోహన్‌ తెలిపారు. గుడిపాల మండలంలోని లక్ష్మీనరసింహ కాలేజీ వద్ద అనుమానాస్పదంగా ఓ మృతదేహం ఉన్నట్లు సోమవారం సాయంత్రం సమాచారం అందిందన్నారు. దీంతో అక్కడికి వెళ్లి విచారించగా తమిళనాడు ప్రాంతం నుంచి వచ్చినట్లు ఇతను హిందీ భాషలో మాట్లాడుతున్నట్లు హిందీ వ్యక్తిగా ఉన్నాడని స్థానికంగా ఉన్నవారు పోలీసులకు తెలిపారు. సుమారు 45 సంవత్సరాలు పైబడి ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రూ 1.85 లక్షలు మెక్కేశారు

- కలెక్టరుకు ఫిర్యాదు

పెద్దపంజాణి: బోరు మోటారు పాడైందంటూ అందరి కళ్లుగప్పి పాత బోరునే కొత్త బోరుగా చూపి, రూ 1.85 లక్షలు మెక్కేశారు. ఈ విషయమై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ మురళీకృష్ణ సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కోగిలేరు పంచాయతీ బసవరాజుకండ్రిగలో తాగునీటి బోరు ఉంది. అయితే బాగా పని చేస్తున్న బోరును తప్పుడు రికార్డులతో పనిచేయనట్లుగా చూపి, దానికి సంబంధించి కొత్త మోటారు, పంపుసెట్‌, ఇతర పనిముట్లను మార్చాలంటూ టీడీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి చేసి, మండల పరిషత్‌ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 2025 జనవరిలో రూ 1.85 లక్షల నిధులు మంజూరు చేయించుకున్నారు. ఆపై తాఫీగా మోటారు మార్చినట్లు కాగితాల్లోనే చూపి, రూ.1.85 లక్షలు మెక్కేశారు. ఈ విషయాన్ని అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ మురళీకృష్ణ గుర్తించి, ఆ పనికి సంబంధించి ప్రభుత్వ రికార్డులను, మెజర్‌మెంట్‌ బుక్కును తీసుకుని సోమవారం పలమనేరులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. సదరు భాగోతంపై జిల్లా కలెక్టర్‌కు విచారణకు ఆదేశించినట్లు ఫిర్యాదుదారుడు మురళీకృష్ణ తెలిపారు.

నేడు బీఎస్‌ఎన్‌ఎల్‌ సర్వీస్‌ క్యాంప్‌

చిత్తూరు కార్పొరేషన్‌: నగరంలోని బీఎస్‌ఎన్‌ఎల్‌ కార్యాలయంలో మంగళవారం కస్టమర్‌ సర్వీస్‌ క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు డీఈ సురేంద్రనాథ్‌ తెలిపారు. ఫైబర్‌ టు ది హోమ్‌ కనెక్షన్లు, సిమ్‌కార్డుల బుకింగ్‌, యాక్టివేషన్‌ ఇతర అంశాలపై వినియోగదారులకు సేవలు అందిస్తామన్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. వినియోగదారులు సమస్యలుంటే తెలియజేయాలన్నారు.

కొడుకు చేతిలో గాయపడిన తండ్రి మృతి

– గ్రామస్తుల సహకారంతో అంతిమ వీడ్కోలు



చిన్నప్పరెడ్డి మృతదేహం

చౌడేపల్లె: కొడుకు, కోడలి దాడిలో గాయపడిన తండ్రి మనోవేదనతో మృతి చెందిన ఘటన ఏ.కొత్తకోట పంచాయతీ అంకుతోటపల్లెలో సోమవారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. అంకుతోటపల్లెకు చెందిన చిన్నప్పరెడ్డి(90), రాజమ్మ దంపతులకు కుమారుడు మనోహర్‌రెడ్డి, కోడలు సరస్వతమ్మ ఉన్నారు. కొడుకు,కోడలు కలిసి గత మార్చి 30వ తేదీన చిన్నప్పరెడ్డిని చితకబాదడంతో కాలు విరిగి పోయింది. ఈ ఘటనపై సాక్షిదినపత్రికలో 'కడుపున పుట్టినోళ్లా...తోడేళ్లా' అనే శీర్షికన వృద్ధ దంపతుల దీనగాథపై ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ కథనంపై స్పందించిన ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు చౌడేపల్లె పోలీసులు కొడుకు, కోడలిపై కేసు నమోదు చేశారు. కాగా తీవ్రంగా గాయపడి కాలు విరిగిన చిన్నప్పరెడ్డిను మాజీ సర్పంచ్‌ విజయకుమార్‌రెడ్డి సహకారంతో గ్రామస్తుల కలిసి మదనపల్లెలో ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. వారం రోజుల క్రితం డిస్‌చార్జి కాగా ఇంటికి వచ్చిన చిన్నప్పరెడ్డి మనోవేదనకు గురై అస్వస్థకు గురై సోమవారం మృతి చెందాడు. కుటుంబసభ్యులెవరూ సహకరించకపోవడంతో ఇలాంటి కష్టం మరెవరికీ రాకూడదంటూ మృతుడు భార్య రాజమ్మ చేసిన రోదన పలువురిని కలిచివేశాయి. గ్రామస్తుల సహకారంతో అంతిమయాత్ర నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో మదరసా హజ్రత్‌ మృతి



ఘటన స్థలంలో సోహైల్‌ అహ్మద్‌ మృతదేహం



సోహైల్‌ అహ్మద్‌(ఫైల్‌)

పలమనేరు: చెన్నై– బెంగళూరు జాతీయ రహదారిపై స్థానిక హెచ్‌పీ పెట్రోల్‌ బంకు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగమంగళం మదరసా హజ్రత్‌ సోహైల్‌ అహ్మద్‌(35) అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణంలో నుంచి స్కూటీలో నాగమంగళంలోని మదరసాకు వెళతుండగా ఎదురుగా సేలం నుంచి తిరుపతికి వెళుతున్న తమిళనాడు ఆర్టీసీ బస్సు స్కూటీని ఢీకొంది. దీంతో ఆయన తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. ఆయనకు భార్య ముగ్గురు ఆడపిల్లలున్నారు. విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

భూసమస్యల పరిష్కారమే ప్రత్యేక అజెండా



మాట్లాడుతున్న కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌

పలమనేరు: భూ సమస్యల పరిష్కారమే ప్రత్యేక అజెండాగా చేసుకుని వీటి పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతామని జిల్లా కలెక్టర్‌ సుమిత్‌కుమార్‌ వెల్లడించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఎస్పీ మణికంఠ చందోలు, జేసీ విద్యాధరి, ఎమ్మెల్యే అమరనాథరెడ్డితో కలసి గ్రీవెన్స్‌డే నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ ఇక్కడొచ్చిన సమస్యల్లో 95 శాతం రెవెన్యూ సమస్యలే ఉన్నాయన్నారు. వీటి పరిష్కారానికి ఆయా తహసీల్దార్లు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. రానున్న మూడు నెలల్లో ప్రతి సోమవారం ఇక్కడే గ్రీవెన్స్‌డేను నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లాలో పీజీఆర్‌ఎస్‌ ద్వారా 53 వేల వినతులందగా వీటిల్లో 12వేల అర్జీలు కుప్పం నియోజకవర్గంనుంచే ఉన్నాయన్నారు. త్వరలో కుప్పంలోనూ ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపా రు. గతంలో పుంగనూరులో జమీందారి వ్యవస్థ, పలమనేరు ప్రాంతంలో కొన్ని ప్రత్యేక పరిస్థితుల కారణంగా ఎక్కువగా సమస్యలున్నాయని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు.

అయ్యా..సమస్యలు పరిష్కరించండి!

- కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక
- అర్జీలు స్వీకరించిన స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్లు
- 258 అర్జీలు నమోదు

చిత్తూరు కలెక్టరేట్‌ : 'అయ్యా దూర ప్రాంతాల నుంచి ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు విచ్చేస్తున్నాం. సమస్యల పరిష్కారం కోసం అర్జీలు ఇస్తూనే ఉన్నాం. అయితే క్షేత్రస్థాయిలో తమ సమస్యలు ఏ మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. సమస్యల పరిష్కారానికి ఇంకెన్ని సార్లు కార్యాలయాల చుట్టూ తిరగాలయ్యా అంటూ అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేశారు. దయచూపి తమ సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నారు.'

258 అర్జీలు నమోదు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ శాఖలకు సంబంధించి 258 అర్జీలు నమోదయ్యాయి. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలే 213 ఉండడం గమనార్హం. మిగిలిన శాఖలకు సంబంధించి పోలీసు 6, డ్వామా 1, ఆర్‌అండ్‌బీ 1, డీఆర్‌డీఏ 26, డీసీహెచ్‌ఎస్‌ 1, మున్సిపల్‌ కమిషనర్‌ నగరి 2, డీఎస్‌ఓ 4, పశుసంవర్థకశాఖ 2, హౌసింగ్‌ 3 మొత్తం 258 అర్జీలను ప్రజలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌లు అనుపమ, విజయలక్ష్మి, వెంకటశివ, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.


ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటున్నారయ్యా!



కలెక్టరేట్‌కు వచ్చిన యనమలమంద వాసులు

ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటున్నారయ్యా అంటూ వెదురుకుప్పం మండలం యనమలమంద గ్రామానికి చెందిన ప్రజలు గణేష్‌, మునెమ్మ, గిరి, గోవిందమ్మ తదితరులు వాపోయారు. ఆ గ్రామస్తులు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు అర్జీని అందజేశారు. వారు మాట్లాడుతూ వెదురుకుప్పం మండలం యనమలమంద గ్రామం ఆళ్ల మడుగు లెక్కదాఖలాలో సర్వే నంబర్‌ 435/2 లో 2.87ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందన్నారు. ఆ స్థలాన్ని గ్రామానికి చెందిన శ్రీరాములురెడ్డి కబ్జా చేస్తున్నారని చెప్పారు. ఈ విషయాన్ని అనేక సార్లు వెదురుకుప్పం తహసీల్దార్‌కు విన్నవించుకున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమించుకుంటున్న స్థలాన్ని కాపాడి ఇళ్లు లేని పేదలకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన నరసింహులు, వంశీ, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్‌ అసిస్టెంట్‌లంటే చిన్నచూపెందుకు?



డిమాండ్‌లు పరిష్కరించాలని ధర్నా చేస్తున్న ఫీల్డ్‌ అసిస్టెంట్‌లు

ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్‌ అసిస్టెంట్‌లంటే సర్కారుకు చిన్న చూపెందుకని క్షేత్రసహాయకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నామలై ప్రశ్నించారు. ఆ సంఘ నాయకులు కలెక్టరేట్‌ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫీల్డ్‌ అసిస్టెంట్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అకారణంగా ఫీల్డ్‌ అసిస్టెంట్‌లను తొలగించడం అన్యాయమని చెప్పారు. తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. తమ డిమాండ్‌లు పరిష్కరించకపోతే ఈ నెల 28 నుంచి విధులను బహిష్కరించి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు.


ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి



ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

జిల్లాలోని నగరి మండలం నత్తంకండ్రిగ దళితవాడలో 30 ఏళ్లుగా నివాసం ఉంటున్న దళిత కుటుంబాలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్‌ చేశారు. ఆ పార్టీ నాయకులు కలెక్టరేట్‌ ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ నగరిలోని 9వ వార్డులో నెత్తంకండ్రిగ దళితవాడలో నివాసం ఉంటున్న ఇళ్లకు ఇంటిపట్టాలు మంజూరు చేయాలన్నారు. పార్టీ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, చిత్తూరు పట్టణ కార్యదర్శి గోపినాథ్‌, నాయకులు దాసరి చంద్ర,మణి,విజయ్‌ కుమార్‌, నత్తం కండ్రిగ గ్రామ కమిటీ నాయకులు రాజు వేలు,యేసయ్య,హరి తదితరులు పాల్గొన్నారు.

గుడి స్థలం ఆక్రమిస్తున్నారు



గుడిస్థలం ఆక్రమిస్తున్నారని వెల్లడిస్తున్న పిళ్లారికుప్పం గ్రామస్తులు

గుడి స్థలాన్ని కొందరు ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని గంగాధరనెల్లూరు మండలం పిళ్లారికుప్పం ప్రజలు రామప్ప, సుజిత్‌ తదితరులు వాపోయారు. వారు మాట్లాడుతూ తమ గ్రామంలో దాదాపు 100 సంవత్సరాల నుంచి శ్రీరామకృష్ణ భజన మందిరం ఉండేదన్నారు. కాల క్రమేణా ఆ మందిరం శిథిలావస్థకు చేరుకోగా భజనమందిరం వెనుక వైపున తాత్కాలికంగా దేవుడి పటాలు ఏర్పాటు చేశామన్నారు. అక్కడే దూపదీపనైవేద్యాలు సమర్పిస్తున్నామన్నారు. నూతన భజన మందిరం నిర్మాణానికి తహసీల్దార్‌ కార్యాలయ సిబ్బంది సర్వే చేసి, సర్వే నంబర్‌ 366/1లో 0.04 సెంట్ల భూమిని కేటాయించి హద్దు రాళ్లు నాటారని చెప్పారు. అయితే ఆ భూమిని ప్రస్తుతం ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.